క్లుప్తంగా

అందుబాటులో యూరియా

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నట్లు సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. లింగంపేట సహకార సంఘం పరిధిలోని భవానిపేట, పోతాయిపల్లి, లింగంపేట రైతులకు యూరియా అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

వీసీ యూనిట్ మంజూరు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్లస్టర్ రైతులకు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్(వీసీ) యూనిట్ మంజూరైనట్లు వ్యవసాయ విస్తర్ణాధికారి రాణి తెలిపారు. తాడ్కోల్ రైతువేదికలో ఏర్పాటు చేసిన వీసీ యూనిట్ ద్వారా ఇకపై రైతులకు నేరుగా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు తదితర కార్యక్రమాలు ప్రత్యక్షంగా వీక్షించి సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3గంటలకు రైతునేస్తం కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు.

గాంధారి, నేరల్ రైతువేదికల్లో వీసీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గల రైతు వేదికతో పాటు నేరల్ రైతు వేదికలో సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు రైతు నేస్తం కార్యక్రమం వీసీ ఉంటుందని గాంధారి పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏఈవో విఘ్నేష్ ఆదివారం తెలిపారు. పైన తెలిపిన రెండు రైతు వేదికలకు వీసీ యూనిట్లు మంజూరయ్యాయన్నారు.

బీబీపేటలో..

బీబీపేట: మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలో ఉన్నటువంటి రైతులు నేడు ఉదయం రైతు వేదిక వద్దకు హాజరు కావాలని ఏవో నరేందర్ ఆదివారం తెలిపారు. బీబీపేట, యాడారం, మాందాపూర్ రైతు వేదికల ద్వారా వీసీ నిర్వహించనున్నారని ఆయన తెలిపారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యయసాయ అధికారి నర్సిములు తెలిపారు. తాడ్వాయి రైతు వేదిక కార్యాలయంతో పాటు ఎర్రాపహాడ్, కన్‌కల్ గ్రామాలలోగల రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. రైతులు హాజరు కావాలని కోరారు.

నోటు పుస్తకాల పంపిణీ



రాజంపేట: రాజంపేట గ్రామ గంగపుత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు అందజేస్తారు. అందులో భాగంగా ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు గంగపుత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం భవనంలో నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు అతిథులుగా హాజరై వారి చేతుల మీదుగా నోటు పుస్తకాలు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు బక్కి దుర్గయ్య, కుంట నర్సింలు, కుంట ఎల్లయ్య, బక్కి భాస్కర్, కంపరి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో..



కామారెడ్డి: కామారెడ్డి మండలం క్యాసంపల్లి మండల పరిషత్ పాఠశాలలో ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్(హైదరాబాద్) ప్రతినిధులు విద్యార్థులకు ఆదివారం నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో స్కూల్ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ బడి కోసం ఊరంతా ఏకమై సుమారు రూ.7 లక్షల చందాలు వసూలు చేసి మూడు క్లాస్ రూంలు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పలువురి సత్కరించారు.

'మా వంతు సహకారం అందిస్తాం'



రాజంపేట: గుండారం ప్రాథమిక పాఠశాలకు మా వంతు సహకారాన్ని అందిస్తామని వివేకానంద సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆదివారం గుండారం ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు.. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి..విద్యార్థుల తల్లిదండ్రులు, వివేకానంద పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు.

స్టేడియం కల నెరవేరేనా?

- తాడ్వాయిలో మధ్యలోనే నిలిపేసిన స్టేడియం పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



స్టేడియం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



బేస్‌మెంట్ వరకు నిర్మించిన పెవిలియన్ గదులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఊర గట్టుపై 30 ఏళ్ల క్రితం మినీ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులు లేక పాలకుల నిర్లక్ష్యం వల్ల మధ్యలోనే పనులు నిలిపి వేశారు. అప్పటి గ్రామ సర్పంచ్ కాశెట్టి స్వామి హయాంలో క్రీడల మంత్రి శ్రీధర్ రెడ్డి తాడ్వాయి మండలానికి మినీ స్టేడియం మంజూరు చేశారు. గ్రామస్తులు డబ్బులను పోగుచేసి గ్రామ శివారులోని ఊరగుట్టపై ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వం పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటి ప్రభుత్వం మినీ స్టేడియం నిర్మాణపు పనులకు రూ.14 లక్షలను కేటాయించింది. కాగా మొదటి దఫాగా రూ.2.50 లక్షలు విడుదల అయ్యాయి. దీంతో 6 పెవిలియన్ గదులు, స్టేడియం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు పూనుకున్నారు. గదులు మాత్రం పునాది దశను దాట లేదు. హైదర్ రాళ్లతో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఫెన్సింగ్ కూడా ధ్వంసమైంది. ఆ తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టడానికి రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. మంత్రి కేటీఆర్ తాడ్వాయిలో శంకుస్థాపన కూడా చేశారు. కాని ఒక్క రూపాయి పని కూడా జరగలేదు. పూర్తి స్థాయిలో స్టేడియం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా క్రీడాభిమానులు, యువకులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి మధ్యలోనే నిలిచిపోయిన మిని స్టేడియ నిర్మాణ పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని, అన్ని రంగాలలో రాణించేలా చూడాలని వివిధ గ్రామాల క్రీడాకారులు కోరుతున్నారు.

నైపుణ్యం ఉన్నా సలహాలిచ్చేవారు లేరు



క్రీడాకారులలో నైపుణ్యం ఉన్నా సరియైన అవగాహన లేక క్రీడాకారులు ఎదగలేక పోతున్నారు. సరైన సదుపాయాలు, వసతులు లేక గ్రామీణ క్రీడాకారులు రాణించలేకపోతున్నారు. స్టేడియం అందుబాటులోకి వస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు తయారవుతారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.

–సాయి కుమార్, సీనియర్ క్రీడాకారుడు

సీనియర్ క్రీడాకారులను ఆశ్రయిస్తున్నాం



కోచ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆటలు ఎలా ఆడాలో నేర్చుకోడానికి సీనియర్ క్రీడాకారులను ఆశ్రయిస్తున్నాం. వారు మాకు కోసం సమయాన్ని కేటాయించి ఆటలను నేర్పుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్టేడియానికి నిధులు విడుదల చేసి,కోచ్‌లు సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

–మద్ది విశాల్‌రెడ్డి, క్రీడాకారుడు

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



సమావేశమైన జిల్లా పర్యవేక్షకులు సామ్యేల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నేతలు

రామారెడ్డి: వచ్చే జూలై 7న అన్ని గ్రామాల్లో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని కామారెడ్డి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యెల్ మాదిగ పిలుపునిచ్చారు. రామారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. మాదిగల ఉద్యమం మానవతా ఉద్యమంగా మారిందని అన్నారు. గ్రామాలు డప్పులతో దద్దరిల్లే విధంగా ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాలు ఇప్పటి నుంచే కృషి చేయాలని కోరారు. ఆదివారం రామారెడ్డి, ఉప్పల్‌వాయి, కన్నాపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొత్తోళ్ల యాదగిరి, మండల అధ్యక్షుడు రాజనర్సు మాదిగ, ఉపాధ్యక్షులు కాస్తూరి శైలేష్ మాదిగ, మహిళా నేత పద్మ తదితరులు పాల్గొన్నారు.

పైపులైను లీకేజీలకు మరమ్మతులు



బాన్సువాడ: బాన్సువాడ ఎత్తిపోతల పథకం పైపులైను లీకేజీలకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ త్తిపోతల పథకం కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయకట్ట రైతులే ఓ కమిటీ వేసుకుని ఎత్తిపోతల పథకం నిర్వహణ కొనసాగిస్తున్నారు. పైపులైను వేసి 15 ఏళ్లు కావడంతో చాలా చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో సాగు నీరు వృథాగా పోతుంది. వారం రోజులుగా లీకేజీలకు మరమ్మతులు చేస్తున్నారు. పాలకులు స్పందించి కొత్త పైపులైనుకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు పెట్టండి..



బుడిమి-కొత్తాబాది రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

బాన్సువాడ రూరల్: కొత్తాబాది నుంచి బుడిమి వరకు ఉన్న రహదారిపై పలుచోట్ల ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. కొత్తగా వాహనాలలో వచ్చే వారు ఈ మార్గంలో అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో సత్వరం సహాయక చర్యలు కూడా అందటం లేదు. ఈ నెల 12న రాత్రి నిజాంసాగర్ మండలం కొనతండాకు చెందిన మోతీలాల్ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సంబంధిత శాఖాధికారులు స్పందించి రోడ్డుపై ప్రమాదకర మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డులు అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ పోస్టర్ల ఆవిష్కరణ



బిచ్కుంద(జుక్కల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, చేసిన అభివృద్ధిపై ఆదివారం బిచ్కుందలో బీజేపీ నాయకులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం సీసీరోడ్లు, మురికి కాలువలు ఇతర అభివృద్ధి పనులు చేసిందన్నారు. ఉచితంగా పేదలకు రేషన్ బియ్యం, ప్రతి గడపకు కేంద్ర సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. పల్లెలతో పాటు పట్టణాలు వేల కిలో మీటర్ల నేషనల్ హైవే రోడ్లు వేసినట్లు గుర్తు చేశారు. కార్యకర్తలు పీరాజీ, శివాజీ, మోహన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గడికోటలో సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో ఆదివారం గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించి అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ ఏడాది పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల చెందిన పలువురు విద్యార్థులు సుమయ, నవదీప్‌లకు రూ.25,000 వేల చొప్పున, సన్నిహితకు రూ.20,000, రేవతికి రూ.18,000, రాహుల్‌కు రూ.15,000 చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ తిరుమల గౌడ్, సొసైటీ చైర్మన్ నాగరాజురెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, గడికోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి, తదితరులున్నారు.

'శ్రీశ్రీ స్ఫూర్తితో రచనలు చేయాలి'



నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: కార్మిక కర్షక లోకానికి శ్రమ జీవికి బాసటగా నిలబడిన మహా కవి శ్రీశ్రీ(శ్రీరంగం శ్రీనివాస్‌రావు) అని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో తెరవే శ్రీశ్రీ వర్ధంతి సభను నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది. తెరవే ప్రతినిధులు శ్రీశ్రీ కవితలను గానం చేశారు. తెరవే ప్రతినిధులు యెనిశెట్టి గంగాప్రసాద్, కాసర్ల రామచంద్రం, బి.నాగభూషణం, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ, ముత్యాలమ్మకు బోనాల సమర్పణ



గొట్టిముక్కల గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

దోమకొండ: గొట్టుముక్కలలో ఆదివారం పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు. గత సంవత్సరం గ్రామానికి చెందిన ముదాం గంగరాజు గాయత్రి, శ్రీనివాస్ హరితలు పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి దాతలుగా నిలిచారు. కాగా ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గంగరాజు శ్రీనివాసులు మాట్లాడుతూ.. అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్టు తెలిపారు.

నేటి చిత్రం

పురాతన కట్టడాలను సంరక్షించాలి



శిథిలావస్థకు చేరుకున్న పురాతన స్వాగత తోరణం

రామారెడ్డి: పురాతన కట్టడాలను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. రామారెడ్డి గ్రామ ప్రారంభంలో 15వ శతాబ్దపు నాటి దోమకొండ రాజులు స్వాగత(బురుజు) తోరణాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ బురుజు శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని ప్రభుత్వం, పురావస్తు శాఖ స్పందించి పునరుద్ధరించాలి.

– గంగాధర్, రామారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

కనీసం గుంతలనైనా పూడ్చరూ..!



అడివిలింగాల గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడివిలింగాల గేట్ నుంచి అడివిలింగాల గ్రామానికి వెళ్లే 3 కిలో మీటర్ల రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు కిలో మీటర్ల దూరంలో 30 గుంతలు ఉండటంతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తడంతో పాటు వాహనాలు చెడిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికార యంత్రాంగం స్పందించి త్వరగా గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో మరమ్మతులు చేయిస్తాం

ప్యాచ్ వర్కులకు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయి. త్వరలోనే గుంతల పూడ్చి వేత పనులను ప్రారంభిస్తాం.

– గిరిధర్, డీఈ, పంచాయతీరాజ్, ఎల్లారెడ్డి

విద్యుత్ శాఖాధికారుల ఫోన్ నంబర్ల మార్పు

బీబీపేట/నస్రుల్లాబాద్: బీబీపేట, బీర్కూర్ మండల విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లను మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు బీబీపేట మండల విద్యుత్ శాఖ ఏఈ విజయభాస్కర్, బీర్కూర్ ఇన్‌చార్జి ఏఈ అరవింద్ ఆదివారం తెలిపారు.

క్యాడర్	ఫోన్ నంబర్	క్యాడర్	ఫోన్ నంబర్
ఏఈ విజయబాస్కర్	8712482100	లైన్‌మన్ యాడారం	8712482099
సబ్ ఇంజనీర్	8712482101	లైన్‌మన్ జనగామ	8712482093
లైన్ ఇన్‌స్పెక్టర్ బీబీపేట	8712482090	సబ్‌స్టేషన్ బీబీపేట	8712482089
లైన్ ఇన్‌స్పెక్టర్ జనగామ	8712482092	సబ్‌స్టేషన్ మాందాపూర్	8712482096
లైన్‌మన్ బీబీపేట	8712482091	సబ్‌స్టేషన్ జనగామ	8712482094
లైన్‌మన్ తుజాల్‌పూర్	8712482097	సబ్‌స్టేషన్ తుజాల్‌పూర్	8712482098

బీర్కూర్ మండల విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు

క్యాడర్	ఫోన్ నంబర్లు		
ఏఈ	8712481995	లైన్‌మన్	8712481994
లైన్ ఇన్‌స్పెక్టర్	8712481993	బీర్కూర్ సబ్‌స్టేషన్	8712481992
		దామరంచ సబ్‌స్టేషన్	8712481996

చెత్త కుప్పగా మారిన ఇంకుడు గుంత



పోస్టాఫీసులోని ఇంకుడు గుంత పరిస్థితి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి హెడ్ పోస్టాఫీసు ఆవరణలో భూగర్భజలాల వృద్ధి కోసం రెండేళ్ల క్రితం అధునిక పద్ధతిలో ఇంకుడు గుంతను నిర్మించింది. కాగా సిబ్బంది నిర్లక్ష్యంతో ఇంకుడు గుంత కాస్తా చెత్త కుప్పగా మారింది. చెత్తాచెదారంతో పాటు పోస్టాఫీసులో రోజూ శుభ్రం చేసిన చెత్త, కాగితాలను ఇంకుడు గుంతలో వేస్తున్నారు. వర్షాకాలంలో ఇంకుడు నిర్వహణపై శ్రద్ధ వహించి గుంతలో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలిగిస్తే బొట్టు బొట్టు ఇంకుతుందని నిపుణులు అంటున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమయం లేదు.. స్తంభాలు అమర్చండి



సంగ్రాం తండా శివారులో నేలకొరిగిన స్తంభాలు

బాన్సువాడ రూరల్: వారం రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో మండలంలోని సంగ్రాం తండా పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కూలిపోయిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను విద్యుత్ అధికారులు అమర్చకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం నాట్ల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వెంటనే మరమ్మతులు చేపట్టాలని తండా నివాసి భాస్కర్ కోరారు.

ఎంపీడీవో కార్యాలయాలకు స్థానిక సంస్థల సామగ్రి



ఎల్లారెడ్డిరూరల్: స్థానిక సంస్థలకు సంబంధించిన సామగ్రి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా వాటికి సంబంధిత ఎన్నికల అధికారుల హ్యాండ్ బుక్‌లతో పాటు, ఇతర మెటీరియల్ కార్యాలయానికి రావడంతో వాటిని కార్యాలయంలో భద్రపరిచారు. సామగ్రి రావడంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనోనని ఆశావాహులు ఎదురుచూస్తున్నారు.

సంక్షిప్తం

ఉచిత కంటి వైద్య శిబిరం



బీబీపేట: మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరమాండ్ల అధ్యక్షతన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 121 మందికి పరీక్షలు నిర్వహించగా 55 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. అలాగే 46 మందికి అద్దాలు పంపిణీ చేశారు. అంతే కాకుండా 20 మందికి మందులు పంపిణీ చేశారు.

20 వరకు ఉచిత ఫిజియోథెరపి..

కామారెడ్డి అర్బన్: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని విద్యశ్రీ ఫిజియోథెరఫీ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 16 నుంచి 20 వరకు ఉచిత ఫిజియోథెరపి శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు విద్యశ్రీ తెలిపారు. శరీరంలో దీర్ఘకాలిక నొప్పులు ఉన్న వారు సంప్రదించాలన్నారు. ఉచిత శిబిరానికి హాజరై తర్వాత వచ్చే వారికి 50 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు.

బీసీలు అంతా ఏకం కావాలి



రామారెడ్డి: బీసీలకు రిజర్వేషన్లు జనాభాకు తగ్గట్లు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని బీసీ సంఘం నేతలు ఆరోపించారు. ఈ మేరకు రామారెడ్డిలో ఆదివారం మన సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ కులాలకు చెందిన వారు జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎస్టిడి లింబాద్రి మాట్లాడుతూ..53 శాతం బీసీ జనాభా ఉంటే 23 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా బీసీల తలరాతలు మారడం లేదని ఆరోపించారు. నేతలు పొట్టిగారి శ్రీనివాస్, లింబాద్రి శంకర్, విజయ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: మండలంలో నూతనంగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా సాయం కోసం 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏవో ఫయాజుల్లా తెలిపారు. బ్యాంక్ అకౌంట్ మార్చాలనుకున్నా అవకాశం ఉందన్నారు. ఆయా గ్రామాల క్లస్టర్ ఏఈవోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఫార్మర్ ఐడీ పూర్తి చేయని వారువివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.